క్లుప్తంగా

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: వేంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17వతేదీ నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు శిబిర బోధక యోగాచార్యులు జల్లి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ప్రతిరోజు ఉదయం 5 నుంచి 7 గంటల వరకు నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిబిరంలో ప్రాణాయామం, ఆసనాలు, ఆహార నియమాలు, ధ్యానం బోధించనున్నట్లు వివరించారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని తెలిపారు. 8 నుంచి 80 సంవత్సరాల వయస్సు వారు గురుముఖంగా యోగ చేయవచ్చని వివరించారు. వివరాలకు 9247191553 నెంబరులో సంప్రదించాలని కోరారు.

పారాలీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలి

చిలకలూరిపేట: లాభాపేక్ష ఆశించకుండా, సామాజిక సేవాదృక్పదం కలిగిన వారు పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ (ఎఫ్ఏసీ) ఐ.స్వాతి తెలిపారు. చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల మండలాల పరిధిలో పారా లీగల్ వలంటీర్లను నియమించనున్నట్లు వెల్లడించారు. దీనికి గాను ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, లా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమాజంలో నిరుపేదలకు సహాయం చేయాలన్న సంకల్పం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు పదోతరగతి జిరాక్స్ కాపీ, మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్‌తో కలిగిన బయోడేటాతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటోతో దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తులను మండల న్యాయసేవాధికార సంస్థ, కోర్టు భవనాలు, సాంబశివనగర్, చిలకలూరిపేటకు పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా ఈ నెల 20లోపు అందజేయాలన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేటటౌన్: పారా లీగల్ వాలంటీర్ పోస్టులకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయామూర్తి ఎన్. సత్యశ్రీ శనివారం తెలిపారు. సామాన్య ప్రజలకు,న్యాయసేవల సంస్థలకు మధ్యవర్తులుగా వ్యవహరించేందుకు వాలంటీర్లు వారధి వంటివారని తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, న్యాయ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు ఏర్పాటు చేసిన వ్యక్తిగత ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుందని, దరఖాస్తులు మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయానికి 20లోగా పంపాలని ఆమె కోరారు.

యడ్లపాడులో స్వచ్ఛతా శుభ్రతా కార్యక్రమం



యడ్లపాడు: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో అధికారులు స్వచ్ఛతా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతినెలా ప్రతినెలా అధికారులు ఒక్కొక్క అంశాన్ని ఎంచుకుని మూడో శనివారం నాడు విధిగా తమ కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో నిర్వహించాలంటూ గతనెల ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. దీంతో శనివారం తహసీల్దార్ జెట్టి విజయశ్రీ పర్యవేక్షణలో రెవెన్యూ ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై శనివారం నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేటకు చెందిన భవనం కనకయ్య (72) అదే గ్రామానికి చెందిన పూర్ణచంద్రరావు ద్విచక్ర వాహనంపై విజయవాడ వైపు వెళుతున్నారు. చౌడవరం సమీపంలో వేగంగా వెళుతూ డివైడర్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో కనకయ్య అక్కడికక్కడే మృతి చెందగా పూర్ణచంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనపై స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిర్వహించి, మృతుని బంధువులకు అప్పగించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నాదెండ్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఎంపీడీవో స్వరూపరాణి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లతో పాటూ అన్ని గ్రామాల్లో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పంచాయతీ సిబ్బందితో కలిసి రోడ్లు శుభ్రం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. వీధుల్లో చెత్త వేయకుండా పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ లక్ష్మీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

భవితకు పునాది - ఎదుగుదలకు ఉపాధి

- కేంద్ర పోషణ్ భీ-పఢాయి భీ కార్యక్రమానికి శ్రీకారం
- అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ



జగ్గాపురం జెడ్పీహైస్కూల్లో శిక్షణ ఇస్తున్న దృశ్యం





లింగారావుపాలెం జెడ్పీ హైస్కూల్లో శిక్షణ ఇస్తున్న డీఆర్‌పీలు

యడ్లపాడు: కేంద్ర ప్రభుత్వం బాలల ఆరోగ్యపరమైన పోషణ, విద్య ప్రాముఖ్యత వంటి అంశాలను మరింత మెరుగుపర్చేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ ఏడాది అంగన్‌వాడీ కార్యకర్తలకు 'పోషణ్‌భీ-పఢాయిభీ 'పై ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. పోషణాహార లోపం లేకుండా సంపూర్ణ, నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఇటీవల రాష్ట్రస్థాయి రీసోర్సు పర్సన్ల వద్ద శిక్షణ పొందిన డీఆర్‌పీలు క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలకు మూడు రోజులు పాటు వీటిపై శిక్షణ అందిస్తున్నారు.

ఆటా ఆధారిత విద్యా బోధన

ఈ శిక్షణ ఆధార్‌షీలా, నవచేతన కార్యక్రమం ద్వారా బాలల తొలి మూడేళ్ల అభివృద్ధి, తల్లిదండ్రుల అవగాహన, మానసిక వికాసం వంటి ముఖ్యమైన అంశాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు వివరిస్తున్నారు. బాల్య దశ నుంచే సరైన మార్గదర్శకత్వం అందించాలనే లక్ష్యంతో ఆట ఆధారిత బోధన, పోషకాహార ప్రాముఖ్యత, కుటుంబ భాగస్వామ్యం వంటి అంశాలపై శిక్షణ కొనసాగుతోంది.

శిక్షణ కార్యక్రమం ముఖ్యాంశాలు

- నియోజకవర్గంలోని నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండలాల్లో ఏకకాలంలో 13, 14, 15 తేదీల్లో మూడు రోజులు చొప్పున శిక్షణ
- నాదెండ్ల, గణపవరం, లింగారావుపాలెం, జగ్గాపురం, కావూరు, మురికిపూడి జెడ్పీ హైస్కూళ్ల వేదిక నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 267 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 264 మంది కార్యకర్తలు హాజరు
- 10 మంది సూపర్వైజర్లు, ఇద్దరు సీడీపీవోలచే ప్రొజెక్టర్లు, టీవీలుపై అవగాహన కల్పన
- చిన్నారుల 85% మెదడు అభివృద్ధి తొలి మూడేళ్లలోనే జరుగుతుందని సర్వేలు చెబుతున్న నేపథ్యంలో, ఈ శిక్షణ ద్వారా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అందించాల్సిన ప్రేరణపై ప్రత్యేక దృష్టి.

గర్భస్థ దశ నుంచే..



మూడేళ్ల లోపు పిల్లలు ఆరోగ్యంగా, తెలివిగా ఎదగాలంటే గర్భస్థ దశ నుంచే సరైన పోషణ, సంరక్షణ అవసరం. తల్లిదండ్రుల అవగాహన పెరిగితే పిల్లలు భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా మారతారు. ఈ శిక్షణ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు కుటుంబ సభ్యులకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించగలుగుతారు.

–శాంతకుమారి, సీడీపీవో

బాల్య విద్యే ప్రధాన లక్ష్యం



ఆదర్‌షీలా, నవచేతన కార్యక్రమంలో భాగంగా మూడేళ్ల లోపు పిల్లలకు బాల్య విద్యను అందించడమే ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా ఆట ఆధారిత విద్యా శిక్షణ ద్వారా పిల్లల మానసిక, భౌతిక అభివృద్ధిని మెరుగుపర్చాలి. ఈ శిక్షణ ద్వారా కార్యకర్తలు ఆ లక్ష్యాన్ని చేరుకునేలా మారతారు.

–నిర్మలారాణి, ఏసీడీపీవో


తొలి మూడేళ్లే ముఖ్యం



తొలి మూడేళ్లు పిల్లల జీవితానికి బలమైన పునాదిగా నిలుస్తాయి. కేంద్రాల్లోని ప్రీస్కూల్ విద్యను మౌలిక వసతుల కల్పనతో అలాగే వివిధ ఆట వస్తువులతో చిన్నారులకు సమగ్రంగా అందిస్తే పిల్లలు భవిష్యత్‌లో విద్యలో బాగా రాణిస్తారు. అందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది.

–ఎం జోజమ్మ, సూపర్‌వైజర్

ఘనంగా వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ రమణకు జ్ఞాపిక అందిస్తున్న కమిటీ సభ్యులు

నాదెండ్ల: గణపవరం-కావూరు డొంక రోడ్డులో కొలువై యున్న చారిత్రాత్మక ఆలయమైన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం తృతీయ వార్షికోత్సవం వేడుకలు శనివారంతో ముగిశాయి. తొలిరోజు శుక్రవారం సువర్చలా సమేత వీరాంజనేయ స్వామి వారి కల్యాణం, లక్ష్మీగణపతి హోమం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు పరిమి లక్ష్మీనారాయణ శాస్త్రి, దర్శి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి గోత్రనామ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి సుప్రభాత సేవ, విశేష పూజలు నిర్వహించారు. పది వేల మందికి పైగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. స్వామి వారిని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వీ రమణ, పల్నాడు జిల్లా డీఆర్‌వో ఏకా మురళి, నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, పలువురు వ్యాపారవేత్తలు స్వామిని దర్శించుకున్నారు. వీరికి కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కాట్రు శ్రీనివాసరావు, ఆదిపూడి మల్లిఖార్జునరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలి

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో డీఈవో చంద్రకళ



స్వచ్ఛ పాఠశాల కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, ఉపాధ్యాయులు

నాదెండ్ల: చదువులో వెనుకంజలో ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ చెప్పారు. గణపవరం కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం శనివారం జరిగింది. క్లస్టర్ కాంప్లెక్స్‌కు 30 ప్రాథమిక, 29 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 13 ఒకేషనల్ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు. కాంప్లెక్స్ అబ్జర్వర్ డీఈవో చంద్రకళ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతున్నాయని, నూతనంగా గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్లస్టర్ కాంప్లెక్స్‌కు ఎంపికై ందన్నారు. ఈ ఏడాది ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకూ మంచి ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎస్.పూర్ణచంద్రరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణానాయక్ పాల్గొన్నారు.

స్వచ్ఛ పాఠశాలల శుభ్రం...

పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రతి రోజూ ఉదయం స్వచ్ఛ పాఠశాల కార్యక్రమంలో పాలుపంచుకోవాలన్నారు. పాఠశాల స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలను చీపురుతో శుభ్రం చేశారు.

పోస్టల్ ప్రమాదబీమా పథకాన్ని ఉపయోగించుకోవాలి



ఆదంబీకి చెక్కు అందజేస్తున్న వెంకటస్వామి, మహేష్‌రెడ్డి

చిలకలూరిపేట: పోస్టల్ ప్రమాద బీమా పథకాన్ని పేద, మధ్యతరగతి వర్గాల వారు ఉపయోగించుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి, ఇండియా పోస్టుబ్యాంకు మేనేజర్ మహేష్ రెడ్డి చెప్పారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షేక్ బాజీ సాహెబ్ సతీమణి షేక్ ఆదంబీకి రూ. 10 లక్షల చెక్కును శనివారం చిలకలూరిపేట హెడ్‌పోస్ట్ ఆఫీసులో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం రూ.396తో ప్రజలకు పోస్టల్ ప్రమాద బీమా అందుబాటులో ఉందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకొని కుటుంబాలకు రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్స్‌పెక్టర్ జి.ప్రసాద్, పోస్ట్‌మాస్టర్ తోట శ్రీరామకృష్ణ, ఎంవో వెంకం రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ప్రయోజనం-పంచాయతీకి ఆదాయం

ఎంపీడీవో హేమలతాదేవి



వంకాయలపాడులో కంపోస్టును పరిశీలిస్తున్న ఎంపీడీవో హేమలతాదేవి

యడ్లపాడు: ఇంటి నుంచి నిత్యం వెలువడే వ్యర్థాలను తడి-పొడి చెత్తలుగా వేరుచేసి క్లాప్ మిత్రలకు అందించాలని ఎంపీడీవో వి.హేమలతాదేవి చెప్పారు. స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛదివాస్ పేరిటా ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛత కార్యక్రమాన్ని శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా మండలంలోని వంకాయలపాడు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శనివారం సోర్స్-రీసోర్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్లాప్‌మిత్రలు గ్రామాల్లోని ఇళ్ల, వ్యాపార దుకాణాల నుంచి తీసుకువచ్చే వ్యర్థాలను తడిపొడి చెత్తలుగా వేరు చేసి, డంపింగ్ యార్డులో వానపాముల ద్వారా వర్మీకంపోస్టు తయారీ విధానాన్ని చేపట్టాలన్నారు.

ఆయా ఎరువుల్ని రైతులకు వినియోగించి, తద్వారా పంచాయతీలకు ఆదాయ వనరు పెంపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ షేక్ జాకీర్‌హుస్సేన్, వంకాయలపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి బాపిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నెస్పీ అధికారుల తీరు అభ్యంతరకరం


ఆక్రమించిన పంటకాలువలను పునరుద్ధరించాలంటూ ప్రజా సంఘాల వినతి

నరసరావుపేట: ములకలూరు–గోళ్లపాడు మధ్యలో వేసిన విజయలక్ష్మీ టౌన్‌షిప్, వేద మెడోస్ వెంచర్ వద్ద ఆక్రమణకు గురైన పంట కాలవలను తక్షణమే పునరుద్ధరణలో ఎన్నెస్పీ అధికారుల తీరును ప్రజా సంఘాలు నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం ప్రకాష్‌నగర్‌లోని షాదిఖానా సమీపంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ టౌన్‌షిప్ విషయంలో ఎన్నెస్పీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందన్నారు. రియల్టర్లు గుండా సాంబశివరావు, అనిల్, మరికొందరు పరారీలో ఉండటంతో ఒక నెల రోజులలో వారు ఆక్రమించిన వాగులు, కాలువలపై ఆక్రమణలు తొలగిస్తామంటూ తమ నాయకుడు నల్లపాటి రామారావుకి ఎన్నెస్పీ ఏఇ ఫోన్ చేసి చెప్పారన్నారు. అయితే తాము తక్షణమే ఎన్నెస్పీ కాలువపై వేసిన రోడ్డు నిర్మాణం, గార్డెన్ తొలగించాలని సంబంధిత ఏఈని కోరామన్నారు. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ, ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవుతుంటే చూస్తూ కొంత టైం కావాలని కాలయాపన చేయటం, యజమానులు పరార్ కావటం చూస్తుంటే వీరు విధులు నిర్వహిస్తున్నట్లుగా లేదన్నారు. కాబట్టి పైఅధికారులు కలగజేసుకొని వీరిపై చర్యలు తీసుకోవాలని, అలాగే పంట కాలువలు పునరుద్ధరించాలని కోరారు. పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ దివస్

శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. ఏడుకొండలు, సతీష్, ప్రమీల పాల్గొన్నారు.

రైతులు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలి



మాట్లాడుతున్న ఏడీఏ హనుమంతరావు

పీసపాడు(క్రోసూరు): వ్యవసాయ శాఖ ద్వారా ఈ సంవత్సరం నుంచి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలను పారదర్శకంగా, సులభతరంగా చేయడం కోసం వెబ్ ల్యాండ్‌లో పొలం కలిగి ఉన్న ప్రతి ఒక్క రైతుకు 'ప్రత్యేక గుర్తింపు సంఖ్య' ను ఇస్తున్నట్లు ఏడీఏ వి.హనుమంతరావు తెలిపారు. మండలంలోని పీసపాడు రైతు సేవా కేంద్రంలో శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక సంఖ్య కలిగిన రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందేందుకు రైతు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీ, అడంగల్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, ఆధార్ నంబర్‌కు లింకు అయిన ఫోను నంబర్‌తో రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన విద్య అందించాలి

శావల్యాపురం: అంగన్‌వాడి కేంద్రాల్లోని కార్యకర్తలు చిన్నారులకు పోషకాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు ఎస్.ఉమాదేవి అన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో మూడోవరోజు జరుగుతున్న పోషన్‌భీ, ఫడాయి భీ శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు. సమావేశంలో సీడీపీవో ముదివర్తి అనురాధ, నోడల్ అధికారి అరుణా,ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

నరసరావుపేటటౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎన్. సత్యశ్రీ కోరారు. శనివారం వివిధ శాఖల అధికారులతో కోర్టు చాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి 8వ తేదీ నిర్వహించనున్న జాతీయ అదాలత్‌లో ఎక్కువ శాతం కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సివిల్ కేసులకు సంబంధించి లోక్ అదాలత్‌లో రాజీ పడినట్లయితే కోర్టు ఫీజు వాపసు ఇవ్వబడుతుందన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు, ముందస్తు వ్యాజ్యాలు పరిష్కరించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు కె. మదుస్వామి, ఆర్. ఆశీర్వాదం పాల్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

నరసరావుపేటటౌన్: హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని డీఎస్పీ కె. నాగేశ్వరరావు అన్నారు. హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి అన్న నినాదంతో రవాణ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ లోకనాథం, ఎంవీఐ శివనాగేశ్వరరావు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలి

ఈపూరు(శావల్యాపురం): యూనియన్ బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజరు టి.మాధురి అన్నారు. శనివారం ఈపూరులో యూనియన్ బ్యాంకు నూతన భవనాలు ప్రారంభోత్సరం నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ రిజినల్ మేనేజరు మురళీమోహన్, ఈకార్యక్రమంలో ఈపూరు బ్యాంకు మేనేజరు ముక్కంటి పార్థసారధి, బ్యాంకు అధికారులు చందన,సుకుమార్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం

నూజెండ్ల: స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల్లో అధికారులు శనివారం నిర్వహించారు. ఎంపీడీవో పి.ఉమాదేవి సహచర ఉద్యోగులతో కలిసి కార్యాలయ పరిసరాలు, గదులు శుభ్ర పరిచారు. చెట్ల నాటే కార్యక్రమం కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ అల్లాభక్షు, ఏపీవో ఆంజనేయరాజు, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ కృషి అపారం

నరసరావుపేట: సంత్ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజు సంచార జాతులైన బంజారాల అభివృద్ధికి విశేష కృషిచేశారని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. శనివారం సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలు స్థానిక షాదీఖానాలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీల కోసం తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు వి.కోటనాయక్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ బంజారాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వరికెపూడిశెల ప్రాజెక్టు తక్షణమే పూరిచేయాలని ఆయన కోరారు. గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీనునాయక్, మేఘావతి శ్రీనునాయక్, వి.రవినాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, టీడీపీ నాయకులు కపలవాయి విజయకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

శావల్యాపురం: చదువులో వెనుకబడిన విద్యార్థులను గ్రేడుల వారీగా విభజించి ప్రత్యేక శ్రద్ధ చూపించి మెరుగైన బోధనా సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈవో-2 పుసులూరి లలితకుమారి అన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో శావల్యాపురం క్లస్టర్, మతుకుమల్లి క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, ప్రధానోపాధ్యాయులు బొడ్డపాటి విజయలక్ష్మి, కోటేశ్వరరావు, రీసోర్స్ పర్సన్స్ రాజారమేష్, డి.రవికుమార్, సీఆర్‌పిలు రావూరి శివప్రసాదు, ఎలికా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టర్ రాజుకు ఏషియన్ ఎమినేన్స్ అవార్డు



నరసరావుపేట ఈస్ట్: జేఎన్‌టీయూ-ఎన్ ఇంజినీరింగ్ కళాశాల వ్యాయామ సంచాలకుడు డాక్టర్ జి.పి.రాజుకు ఏషియన్ ఎమినేన్స్ అవార్డు-2025 లభించింది. హైదరాబాద్‌లోని వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రారంభమైన ఇంటర్నేషనల్ కాన్ఫెరెన్స్ ఆన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్-2025 కార్యక్రమంలో తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా డాక్టర్ రాజు అవార్డు అందుకున్నారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం


బొల్లాపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషన్‌బీ-పడాయిబీలో భాగంగా మూడు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈపూరు ప్రాజెక్టు పరిధిలోని బొల్లాపల్లి, వెల్లటూరు, ఈపూరు, కొచ్చర్ల సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు వెల్లటూరు, ఈపూరు గ్రామ జడ్పీ హైస్కూల్లో ఈ శిక్షణ నిర్వహించడం జరిగిందని ప్రాజెక్టు సీడీపీవో బి.అరుణ తెలిపారు. ఆయా కేంద్రాల్లో శిక్షకులుగా బి.అరుణ, మస్తాన్‌బీ, చిన్నమ్మాయి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి

రొంపిచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడాలని ఎఈఓ డి.బ్రహ్మేశ్వరరావు అన్నారు. మండలంలో రొంపిచర్ల, సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ లో శనివారం నిర్వహించిన క్లస్టర్ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ, పి.శ్రీనివాసరావు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.రవినాయక్, ఆయా స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడి-పొడి చెత్తలను వేరుచేసి ఇవ్వాలి

పురపాలక కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర నిర్వహణ



కార్యాలయంలో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న కమిషనర్

నరసరావుపేట: పట్టణ ప్రజలందరూ తమ ఇళ్లల్లో తయారయ్యే చెత్తను తడి, పొడి చెత్తలతో పాటు హానికరమైన వాటిని వేరుచేసి విడి విడిగా పురపాలక సిబ్బందికి అందజేయాలని కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. స్థానిక పురపాలక కార్యాలయంలో శనివారం కమిషనర్ పర్యవేక్షణలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించి కార్యాలయాన్ని శుభ్రం చేశారు. కార్యాలయం లోపల, బయట టేబుళ్లు, కుర్చీలు, కిటికీలు, రికార్డు రూములను శుభ్రం చేసి టెర్రస్‌పై నున్న పిచ్చిమొక్కలను తొలగించారు. పట్టణం మొత్తం తడి, పొడి చెత్త, హానికరమైన మూడురకాల బుట్టలను ఉపయోగించాలని కమిషనర్ ప్రజలను కోరారు. మేనేజర్ శ్రీనివాసరావు, డీఈ మహమద్ రఫీ, టీపీవో సాంబయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ కోటయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి ఆర్థికచేయూత

బొల్లాపల్లి : మండల వనరుల కేంద్రంలో డేటా ఆపరేటర్‌గా పనిచేస్తూ ఆకస్మికంగా మృతిచెందిన ఉద్యోగి కుటుంబానికి ఉపాధ్యాయులు తమవంతు ఆర్థిక చేయూత అందజేశారు. మండల వనరుల కేంద్రంలో డేటా ఆపరేటర్‌గా పనిచేస్తున్న మాదినేని చెన్నయ్య ఇటీవల ఆకస్మికంగా మృతిచెందాడు. ఆయన కుటుంబానికి మండల విద్యాశాఖ అధికారులు -1, 2 ఎం.సయ్యద్ జఫ్రుల్లా, కె.పార్వతి చేతుల మీదుగా మండలానికి చెందిన ఉపాధ్యాయులు రూ.2,30,500లు అందజేశారు. కుటుంబసభ్యులు ఆర్థిక చేయూతకు కృతజ్ఞతలు తెలియజేశారు.